మహిళలకు రక్షణ కల్పించాలి

ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి

ప్రజాశక్తి- పలమనేరు: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారికి సపోర్ట్‌గా బిజెపి వుంటుందని ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి ఆరోపించారు. సోమవారం ఐద్వా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్‌డిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ ఐద్వా ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించి బిజెపికి తగిన బుద్ధి చెప్పుతామని హెచ్చరించారు. మద్యం, మత్తు పదార్ధాలను నియంత్రించాలని, స్త్రీల పట్ల అశ్లీలతను ప్రేరేపించే టీవీ సీరియల్స్, ఇంటర్ నెట్ ప్రోగ్రామ్స్‌ను నియత్రించాలని అన్నారు. అక్టోబర్ 5వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగే బహిరంగ సభకు మహిళలందరూ పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇంద్రావతి, జయంతి, కైరున్నీషా, నిర్మల పాల్గొన్నారు.

నిర్బంధాలు, అరెస్టులను నిరసిస్తూ..

అంగన్వాడీల ధర్నాలు

సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడుదాం

గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా నిర్బంధాలకు గురిచేయడం దుర్మార్గమని, ఈ నిర్బంధాన్ని నిరసిస్తూ సోమవారం చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోదండన్ మాట్లాడుతూ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నందుకు అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా తమ గోడు చెప్పుకోవడానికి వస్తున్నవారిపై అమానుషంగా నిర్బంధానికి గురిచేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వస్తే అంగన్వాడీలకు పక్క రాష్ట్రం కంటే అదనంగా వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చి నాలుగు సంవత్సరాలైనా జీతాలు పెంచలేదని విమర్శించారు. రకరకాల యాప్‌ల పేరుతో అంగన్వాడీలపై పనిభారం భారీస్థాయిలో పెంచారని విమర్శించారు. అన్ని రకాల ప్రభుత్వ పనులు చేస్తున్నప్పటికీ అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యువిటీ అమలు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేడు అంగన్వాడీలు అడుగుతున్న కోరికలు గొంతెమ్మ కోరికలు కాదని ఏవైతే హామీలు ఇచ్చారో వాటిని అమలు చేయడంలో ఎందుకు మీనమేషాలు లెక్కపెడుతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కారం చేస్తే ధర్నాలు చేయాల్సిన పరిస్థితి లేదు కదా అన్నారు. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేసే దిశగా ఆలోచించకుండా పోలీసులు ద్వారా ఉద్యమాలను అణచాలని ప్రయత్నం చేయడం అరిచేత్తో సూర్యకాంతిని ఆపడం ఎంత అవివేకమో ఇది కూడా అంతేనని అన్నారు. గత ప్రభుత్వాలు అంగన్వాడీ పోరాటాలపై నిర్బంధాన్ని విధిస్తే ఆప్రభుత్వాలను ఇంటికి పంపించిన చరిత్ర అంగన్వాడీలకు ఉందని, అలాంటి పరిస్థితిని మీరు తెచ్చుకుంటున్నారు. ఛలో విజయవాడ బయలుదేరుతున్న అంగన్వాడీలను రకరకాల పద్ధతుల్లో ఒకరోజు ముందు నుంచి ఇండ్ల దగ్గర నిర్బంధాలు గురిచేయడం, వెళుతున్న వారిని పోలీస్‌స్టేషన్లో తరలించి రాత్రి వరకు స్టేషన్లో పెట్టించడం ఏమిటని ప్రశ్నించారు. రాజ్యాంగ హక్కు ప్రకారం రాజ్యాంగబద్ధంగా శాంతియుతంగా కూడా చేయనీయకుండా ఉంటే ప్రభుత్వానికి ఎందుకు అంత భయమని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే భాద్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు సజని, మమత, అంబికా, ప్రమీల, ఆముద, శాంతి, కన్యాకుమారి, హిమబిందు, సునీత, ఏఐటీయూసీ నాయకులు గోపీనాథ్, రమాదేవి, దాసరి చంద్ర, మహిళా సంఘం నాయకులు విజయగౌరి అంగన్వాడీలు పాల్గొన్నారు.

పోలీసుల ఓవరాక్షన్

సోమవారం చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీలను పోలీసులు అడ్డుకున్నారు. అక్కడే ఉన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు వద్దకు వచ్చి మహిళా ఎస్ఐ ధర్నా చేయడానికి పర్మిషన్ లేదని దబాయించడంతో మహిళలు తిరగబడ్డారు. దీంతో కొద్దిసేపు ఉద్రిత్తత కొనసాగింది. శాంతియుతంగా చేస్తున్న కార్యక్రమానికి ఎందుకు అడ్డంకులు పెడుతున్నారని అంగన్వాడీలో భారీగా నినాదాలు చేయడంతో వెనక్కి తగ్గిన పోలీసులు ధర్నా కొనసాగేంత వరకు వేచి చూశారు.

కుప్పం: అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకోవడాన్ని ఖండిస్తూ సోమవారం కుప్పం- పలమనేరు జాతీయ రహదారిలోని ఏరియా ఆసుపత్రి సర్కిల్ వద్ద అంగన్వాడీలు ధర్నాకు దిగారు. దీంతో దాదాపు గంటకు పైగా జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కుప్పం ఎస్సై శివకుమార్ అంగన్‌వాడీలకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం అంగన్వాడీలు అక్కడి నుండి బయలుదేరి తెలుగుదేశం పార్టీ నాయకులు ధర్నా చేపడుతున్న శిబిరానికి చేరుకుని చంద్రబాబుకు సంఘీభావం తెలిపారు.

పలమనేరు: అంగన్వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్స్ న్యాయమైన సమస్యలను అడగడానికి వెళితే అక్రమ అరెస్టులు చేయడం సరికాదని యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సరస్వతీ, చిలకమ్మా ప్రభుత్వాన్ని నిలదీశారు. సోమవారం పలమనేరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కుప్పస్వామికి అందజేశారు. అంగన్వాడీలు నిర్మల, భారతి, నాగరత్న, పరిమళ, విజయమ్మ, సులోచన పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: అంగన్వాడీ యూనియన్ లీడర్ వెంకటరత్నం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా విజయవాడకు వెళుత్తున్న తమను పోలీసులు దౌర్జన్యంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం దారుణమ్నారు.

కార్వేటినగరం: సోమవారం కార్వేటినగరంలోని మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రాజెక్టు పరిధిలోని కార్వేటినగరం, వెదురుకుప్పం, శ్రీరంగరాజాపురం మండలలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా గౌరవాధ్యక్షులు కాంచన మాల, సభ్యులు నాగమ్మ, నాగమణి, ఉమా, యువరాణి, గుణ, విద్య, సుధారాణి, రెడ్డమ్మ, పాల్గొన్నారు.

చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద అంగన్వాడీల ధర్నా

కుప్పంలో..

బైరెడ్డిపల్లిలో..

కనులపండువగా రథోత్సవం

ప్రజాశక్తి- ఐరాల: స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు భాగంగా సోమవారం ఉదయం దేవస్థానం వారిచే స్వామివారి మూలవిరాట్‌కు వివిధ రకాల పరిమళ సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం సిద్ధి బుద్ధి సమేత ఉత్సవమూర్తులను వేద పండితులచే మంత్ర ఘోష చరణాల నడుమ అభిషేకించి రథంపై ఉంచారు. ఆనవాయితీ ప్రకారం మొదట కొంత దూరం లాగి వదిలిన ఆలయ పాలకమండలి, అధికారులు, ఉభయదారులు అనంతరం మంగళ వాయిద్యాలు నడుమ, కోలాటాలు, డ్రమ్స్, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల నడుమ రథోత్సవంను కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ చైర్మన్ ఏ.మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు , ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు ఎస్‌వి కష్ణారెడ్డి, రవీంద్రబాబు విద్యాసాగర్‌రెడ్డి, హరి మాధవరెడ్డి, హేమమాలిని, సర్పంచ్ శాంతి సాగర్‌రెడ్డి, సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్సైలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజలకు హాని కలిగించే ప్రాంతాల్లో క్వారీలొద్దు

తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- నగరి : ప్రజలకు హాని కలిగించే ప్రాంతాల్లో క్వారీలకు అనుమతులు ఇవ్వవద్దని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి, అలాంటివారిపై చర్యలు చేపట్టాలంటూ సీఐ సురేష్‌కు అడవికొత్తూరు, అడవికండ్రిగ గ్రామాలకు చెందిన వారు వినతిపత్రం అందజేశారు. సోమవారం తహసీల్దార్‌ను, సీఐను అధికసంఖ్యలో కలిసిన గ్రామస్థులు వారితో మాట్లాడుతూ ప్రభుత్వానికి తప్పుడు సమాచారం అందించిన కొందరు క్వారీదారులు ప్రజలు నివశించే ప్రాంతంలో సర్వే నెంబరు 285/1, 2లలోని కొండల వద్ద క్వారీ నడపాలని చూస్తున్నారని అన్నారు. గతంలో ఇలాంటి క్వారీల కారణంగా గ్రామాల్లో ఇళ్లు కూలి మరణాలు సంభవించిన సంఘటనలు కూడా ఉన్నాయని అన్నారు. అలాంటివి పునరావత్తం కాకుండా చూడాలన్నారు. క్వారీల ఏర్పాటుకు ఎట్టి పరిస్థితిలోను అనుమతులు ఇవ్వకూడదని అన్నారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ క్వారీ ఏర్పాటు చేస్తున్న ప్రాంతాలను తాను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని అన్నారు. ప్రజలకు హానికలిగించే ఎలాంటి పనులకు తాము అనుమతులు ఇవ్వమని తేల్చి చెప్పారు.

కుప్పం మున్సిపల్ కార్యాలయానికి తాళం

నిరసన తెలిపిన వైసిపి కౌన్సిలర్

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం నియోజక వర్గంలోని అధికార పక్ష పార్టీలోనే నేడు అంతర్గత కలహాలు నెలకొన్నాయి. కుప్పం మున్సిపాలిటీ అభివద్ధి కుంటుపడడంతో సోమవారం సొంత పార్టీకి చెందిన (వైసిపి) నాయకులే కుప్పం మున్సిపాలిటీ కార్యాలయాన్ని తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. రూ.66 కోట్లు కుప్పం అభివద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని స్వయంగా చిత్తూరు జిల్లా వైసిపి ఇంచార్జీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రకటించడంతో పాటు ఆయన కుమారుడు ఎంపి మిథున్ రెడ్డి స్పష్టం చేస్తూ ప్రజలను, అధికార పార్టీ నాయకులకు తెలిపారు. కానీ పలుమార్లు నిధులు విడుదల చేశామని పదేపదే ప్రజాప్రతినిధులు చెబుతున్నా క్షేత్రస్థాయిలోని కౌన్సిలర్లు వార్డుస్థాయిలో అభివృద్ధి పనులు చేయడానికి తగిన నిధులు సమకూర్చడంతో ప్రభుత్వం విఫలమైంది. దీంతో తమకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తుండటంతో సొంత పార్టీలోని కౌన్సిలర్లు ఎదురు తిరిగారు. మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. అనంతరం అక్కడి పోలీసులు చేరుకుని సద్దిచెప్పడంతో వారు వెనుదిరిగారు.

కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయుల ధర్నా

జిపిఎస్‌ను రద్దు చేయాలని ధర్నా చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉద్యోగ, ఉపాధ్యాయులకు జిపిఎస్ (గ్యారంటీ పెన్షన్ స్కీమ్) విధానాన్ని అమలు చేయాలని క్యాబినెట్లో తీర్మానించారు. ఇది ఉద్యోగ ఉపాధ్యాయులకు ఏమాత్రం ఆమోద యోగ్యం కాదని ఫ్యాప్టో చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఏ.మునాఫ్ పేర్కొన్నారు. 2004 నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చి తీరని అన్యాయం చేశారని అన్నారు. ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వారంలో సిపిఎస్ రద్దు చేస్తానని మాట ఇచ్చారు కానీ లక్షలాది మంది ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇష్టం లేని జిపిఎస్ తీసుకువచ్చి తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు టి.రఘుపతి రెడ్డి, గంటా మోహన్, చెంగలరాయ మందడి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు జీవి.రమణ, దేవరాజుల రెడ్డి, కిరణ్‌కుమార్, రామమూర్తి, అరుణ్ కుమార్, ముక్తార్ అహ్మద్, మునీర్ అహమ్మద్, సోమశేఖర్ నాయుడు, మోహన్, ఎస్‌పి బాషా, మదన్ మోహన్ రెడ్డి, జగదీష్, ఏపి సిపిఎస్ ఈఏ నాయకులు పి. సుధాకర్, శ్రీనివాసులు, కడియాల మురళీ, సమీర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఈవోకు యుటిఎఫ్ నేతల వినతి

ఉపాధ్యాయ సమస్యలపై సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావును యుటిఎఫ్ నాయకులు రఘుపతిరెడ్డి, జివి రమణలు కలసి వినతి చేశారు. జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకొచ్చారు. వ్యక్తిగత సమస్యలపై డీఈవో స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈసందర్భంగా యుటిఎఫ్ నేతలు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ పరిధిలోని సమస్యలను డీఈవో దృష్టికి తీసుకురాడం జరిగిందన్నారు. డీఈవో సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన్నట్లు తెలిపారు.

డీఈవోకు వినతి చేస్తున్న యుటిఎఫ్ నేతలు

అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలి: డిఆర్ఓ

అర్జీలపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్న డిఆర్ఒ రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జగనన్నకు చెబుదాం, స్పందనలో ప్రజలు తమ సమస్యల గురించి అందజేసిన అర్జీలను నిర్ణీత సమయం లోపు పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి యన్.రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జడ్పీ సీఈఓ యం.ప్రభాకర్‌రెడ్డితో కలిసి జగనన్నకు చెబుదాం స్పందన, ఎపి సేవ, మీ సేవ, జగనన్న చేదోడు, జగనన్న చేయూత, జగనన్న తోడు, వాహనమిత్ర, అమ్మఒడి, జగనన్న విద్యదీవెన, వసతి దీవెన, కల్యాణ మస్తు, జగనన్న ఆరోగ్య సురక్ష సంబంధించిన అంశాలపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహశీల్దార్లు ఎంపీడీఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారానికి అధికారులందరూ ప్రత్యేకదష్టి పెట్టి నిర్దేశించిన సమయం లోపు పరిష్కరించాలన్నారు. జిల్లా స్థాయిలో జరిగే జగనన్నకు చెబుదాం కార్యక్రమంతోపాటుగా మండల స్థాయిలోనే సమస్యలు పరిస్కారించుటకు కోసం వారంలో రెండు రోజులు బుధ, శుక్ర వారాలలో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో ఈనెల 8న నుండి మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజలు సమస్యలకు సంబంధించి అందిన అర్జీలు రిఓపెన్ కాకుండా చూడాలని తెలిపారు. జగనన్నకు చెబుదాం మండల స్థాయిలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై మండలాల వారిగా సమీక్షించారు. డిప్యూటీ కలెక్టర్ భవాని, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, హౌసింగ్, డిఆర్‌డిఎ, డ్వామా పిడిలు పద్మనాభం, తులసి, గంగాభవాని, డీఈఓ విజేయేంద్ర రావు, డీఎస్ఓ శంకరన్, పశుసంవర్ధకశాఖ జెడి.ప్రభాకర్, డిపిఓ లక్ష్మి, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ చిన్నారెడ్డి, డిఎల్‌డిఓలు రవికుమార్, ఉమాదేవి పాల్గొన్నారు.

మహిళా సంఘ సభ్యులకు ప్రత్యేక విజన్ ఉండాలి

డిఆర్డిఏ పిడి తులసి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: స్వయం సహాయక సంఘ సభ్యులకు జీవనోపాదులు మెరుగు పరుచుకునేందుకు ప్రత్యేక విజన్ ఉండాలని చిత్తూరు డిఆర్డిఏ పిడి తులసి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో విజన్ బిల్డింగ్‌పై మండలంలో ఉన్న అందరూ ఈసీ సభ్యులకు నాలుగు రోజులు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పిడి తులసి మాట్లాడుతూ రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటై సుమారు 20 సంవత్సరాలు దాటిందని, అయితే ఇప్పటికీ స్వయం సహాయక సంఘ సభ్యులు కేవలం చిన్నచిన్న రుణాలకే పరిమితం అవుతున్నారని తెలపారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం సహాయక సంఘ సభ్యుల జీవనోపాదులు పెంపొందించేందుకు అనేక పథకాలను అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పథకాలను గ్రామీణ స్థాయిలో ఉన్న సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుంటే ఆర్థిక స్వాలంబన పెంపొందించుకునే అవకాశం ఉందని, అలాగే అర్హత ఉన్న సంఘ సభ్యులు పారిశ్రామిక వేత్తలుగా తయారు కావచ్చు అన్నారు. సంఘ సభ్యులకు వీటిపై సంపూర్ణ అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కేవలం రుణాలు తీసుకోవడం చెల్లించడం వల్ల స్థానిక అవసరాలు తీరుతాయి కానీ జీవనోపాదులు మెరుగుపడవన్న అంశాన్ని అధికారులు గుర్తించి, స్థానికంగా ఉన్న వనరులను దష్టిలో ఉంచుకొని సంఘ సభ్యులు జీవనోపాదులు పెంచుకునే అంశం పై దష్టి పెట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా సంఘంతో పాటు సమాజంకూడా ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉందన్నారు. అధికారులు మారుతున్న కాలానికి అనుగుణంగా విధిగా సంఘ సభ్యులకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించా లన్నారు. దీనివల్ల రానున్న రోజుల్లో ఉత్తమ ఫలితాలను సాధించవచ్చున్నారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించడం సాధ్యమవుతుందని అన్నారు. ఈసందర్భంగా విజన్ బిల్డింగ్‌పై రిసోర్స్ పర్సన్‌లైన డీపీఎం వెంకటేష్ ఏపీఎంలకు ఇతర సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.కార్యక్రమంలో ఏపీఎం క్రిష్ణప్ప, సీసీలు, సంఘమిత్రాలు గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

స్పందనకు 369 అర్జీలు

స్పందన కార్యక్రమంలో అర్జిలు స్వీకరిస్తున్న డీఆర్ఓ రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిఆర్ఓ ఎన్. రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనలో డిఆర్ఓ, జెడ్‌పి సీఈవో ప్రభాకర్ రెడ్డితో కలసి జిల్లా నలుమూలల నుండి వివిధరకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. మొత్తం 369 అర్జీలు రాగా ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 288, మండల లెవెల్ కో-ఆర్డినేటర్ కమిటీ 18, జిల్లా ఉపాధి శాఖ 2, వాటర్ రిసోర్స్ 1, దేవాదాయ శాఖ 2, డ్వామా 3, నగర పాలక సంస్థ 1, డిఆర్‌డిఏ 1, పోలీసు శాఖ 6, జిల్లా అటవీశాఖ 3, మైన్స్‌శాఖ 2, ఆరోగ్యశ్రీ 2, ఇఇపిఆర్ 1, ఎపిఎస్ పిడిసిఎల్ 3, సర్వేశాఖ 2, నేషనల్ హైవేశాఖ 2, ఎంపిడిఓ పుంగనూరు 1, లాఅండ్ టెక్నికల్ 1, ఇఓపి ఆర్‌డి 1, డిఎం అండ్ హెచ్ఓ 1, ఎంపిడిఓ పాలసముద్రం 1, డీఈఓ 1, జిల్లా సైనిక సంక్షేమ శాఖ 2, ఎంపిడిఓ జిడి నెల్లూరు 1, జిల్లా రిజిస్ట్రేషన్ 1, ఎపిఎస్ ఆర్‌టిసి 1, ఇరిగేషన్ శాఖ 1, ఎల్‌డిఎం 1, ఎంపిడిఓ చిత్తూరు 1, పసుసంవర్ధక శాఖ 1, ఎంపిడిఓ బంగారుపాళ్యం 2, హౌసింగ్ శాఖ 2, ఎంపిడిఓ వెదురుకుప్పం 1, పెన్షన్, రేషన్ కార్డులు, ఇతరులు 12, అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అలసత్వం చేయకండి : ఎస్పీ

స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదు దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి స్వీకరించారు. ఆదేశించారు. సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్‌పి, అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈఫిర్యాదులకు స్పందిస్తూ త్వరితగతిన విచారణ జరిపి ఫిర్యాదుదారులకి న్యాయం చేయాలని సంభందిత అధికారులకు ఆదేశించారు. మొత్తం 30 ఫిర్యాదులు అందగా, చీటింగ్ 1, కుటుంబ తగాదాలు 5, వేధింపులు 2, ఇంటి తగాదాలు 6, భర్త వేధింపులు 2, భూతగాదాలు 7, దారి తగాదాలు 3, పోలీస్ సేవలు 4 అర్జీలు అందాయని తెలిపారు.

పోస్టల్ యాక్ట్ పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తపాలా శాఖలలో పనిచేసే అధికారులు సిబ్బంది పోస్టల్ యాక్ట్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి డాక్టర్ ఐ.కరుణ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా ప్రధాన పోస్టాఫీసులో పోస్టల్ సూపరింటెండెంట్ బి.లక్ష్మన్న, గణపతిలతో కలసి తపాలా శాఖకు సంబంధించిన చట్టాలపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తపాలా శాఖలో పనిచేసే ఇన్స్పెక్టర్లు, సబ్ పోస్టుమాస్టర్స్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ తపాలా శాఖలలో పనిచేసే అధికారులు సిబ్బంది పోస్టల్ యాక్ట్ 1898పై పూర్తి అవగాహన తో పాటుగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా అందజేసే న్యాయ సేవలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పోస్ట్‌మాస్టర్స్ ఏవి భాస్కర్, ఎన్.నాగరాజు, విజయావతి, పాల్గొన్నారు.

'విజయం' విద్యార్థుల ప్రతిభ

విజేతలను అభినందిస్తున్న తేజోమూర్తి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 21 నుండి 23 వరకు గుంటూరు నాగార్జున యూనివర్శిటీలో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ అథ్లెటిక్స్‌లో ఛాంపియన్ షిప్ 2032లో విజయం సైన్సు అండ్ అర్ట్స్ డిగ్రీ కళాశాల విద్యార్థిని యువశ్రీ తన ప్రతిభను చూపించారని విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో యువశ్రీ హైజంప్, జావిలిన్ త్రో విభాగంలో ప్రథమ బహుమతులు సాధించారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో తమ కళాశాల నుండి ఏడు మంది విద్యార్థులు పాల్గొని మూడు బహుమతులు సాధించిన్నట్లు తెలిపారు. రెండు విభాగాల్లో ప్రథమ బహుమతి సాధించిన యువశ్రీని కళాశాల అధినేత, అధ్యాపక బృందం అభినందించారు.

వివిధ క్రీడలలో విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో అండర్ -14, అండర్ -17 కేటగిరిలో వివిధ క్రీడలలో విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతి తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, యోగా, ఖోఖో, బ్యాట్మెంట్స్, లాంగ్ జంప్, రన్నింగ్ రేస్ వంటి వివిధ క్రీడలలో హర్షిత, హరీష్, ఫాక్లీయన్, శరవాణ్, చైతన్య సాయి, మోహన్ రెడ్డి, యశ్వంత్, కోమల, వరుణ్, ద్రాక్షాయని, మౌనిక, కష్ణప్రసాద్ విద్యార్థులు నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయికి వెళ్తారని తెలిపారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో తిరుమలయ్యపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు వ్యాయామ ఆధ్యాపకురాలు త్రిలోక సుందరి సోమవారం తెలిపారు. తిరుమలయ్యపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు కష్ణాజిల్లాలో జరిగిన రెంజ్లింగ్ పోటీలలో దీక్షితరెడ్డి రజిత పథకాన్ని, రేశ్వంత్ కుమార్ వెండి పతకంను సాధించినట్లు ఆమె తెలిపారు. అనతరం విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

'సమస్యలను త్వరగా పరిష్కరించాలి'

ప్రజాశక్తి- ఎస్ఆర్‌పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్‌పురం తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ లోకనాథ పిళ్లై మాట్లాడుతూ అర్జీదారులకు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 11 అర్జీలు అందించినట్లు ఆయన తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: కాలేజీ నుంచి ఇంటికి తిరిగి వెళుతున్న విద్యార్థి మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు లాక్కుని వెళ్లిన జరిగిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని క్షీరసముద్రం గ్రామానికి రమేష్ నాయుడు కూతురు ఉదయ సాయి (20) చిత్తూరు విజయం కాలేజీలో డిగ్రీ చదివింది. కాలేజీకి వెళ్లి టీసీ తీసుకుని తిరిగి క్షీరసముద్రం బస్‌స్టాప్‌లో దిగి ఇంటికి నడిచి వెళుతుండగా దారిలో గుర్తుతెలియని వ్యక్తులు అడ్డగించి విద్యార్థి మెడలో ఉన్న 8 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్ళారు. పోలీస్ స్టేషన్లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్షావలి తెలిపారు.

వ్యక్తి అరెస్టు, 8 రోజులు రిమాండ్

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం బోనమంద గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి 2020వ సంవత్సరంలో పొలం చుట్టూ అక్రమంగా విద్యుత్ కంచె ఏర్పాటు చేసి అడవి జంతువులను చంపడానికి కరెంటు తీగలకు వైర్లను తగిలించి ఉన్నాడన్న సమాచారం మేరకు పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. తదుపరి సుబ్రహ్మణ్యం కోర్టుకు హాజరు కాకపోవడంతో కోర్టు నుండి అరెస్టు వారెంట్ రావడంతో సోమవారం సుబ్రహ్మణ్యంను అరెస్టు చేసి చిత్తూరు జిల్లా మెజిస్ట్రేట్ ఎదుట హాజరపరచగా వారు 25వ తేదీ నుండి అక్టోబర్ మూడవ తేదీ వరకు 8 రోజులపాటు రిమాండ్ విధించినట్టు ఎస్సై వెంకట నరసింహులు తెలిపారు.

మాజీ జెడ్పీటీసీకి మాతృ వియోగం

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామానికి చెందిన రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్, వైసీపీ మాజీ జడ్పీటీసీ గుణశేఖర్ మొదలికి తల్లి సంపూర్ణమ్మ (90) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తెల్లవారుజామున మరణించారు. ఈ సమాచారం తెలుసుకొని రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ బుల్లెట్ సురేష్, వేల్కూరు బాబురెడ్డి, ఫయాజ్ అలీ, కొండారెడ్డి, భీమనేని చిట్టిబాబు నాయుడు, విజయకుమార్ రెడ్డి, నరసింహులు నాయుడు, జ్యోతిరెడ్డి, రాజేష్, సర్పంచ్ శ్రీబాబు, వైసీపీ, టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గుణశేఖర్ మొదలి, షణ్ముఖ మొదలి, కేశవ మొదలిను పలువురు నేతలు పరామర్శించారు.

సంపూర్ణమ్మకు నివాళులు అర్పిస్తున్న భీమనేని చిట్టిబాబు నాయుడు

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యసేవలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతుందని నగర మేయర్ ఎస్.అముద తెలిపారు. సోమవారం 39వ వార్డులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే బందం మేయర్‌కు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇంటి వద్దకే వెళ్లి ప్రజల ఆరోగ్యస్థితిని తెలుసుకొని, మెరుగైన వైద్య సేవలు అందేలా చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మేయర్ స్థానిక నేతాజీ వీధిలో పర్యటించారు. పారిశుద్ధ్యం, రోడ్ల మరమ్మతులపై అధికారులకు సూచనలు ఇచ్చారు.

ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న నగర మేయర్ అముద

'రైతు ఉత్పత్తుల సంఘంతోనే అభివృద్ధి'

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రైతుల ఉత్పత్తి సంఘాలతో రైతులు అభివద్ధి చెందుతున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండల కార్యాలయంలో రైతు ఉత్పత్తుల నూతన సంఘాన్ని ఎంపిక కార్యక్రమం ఏపీవో మీరాబాయి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో వ్యవసాయదారులు పది మంది కలిసి గ్రూపులు తయారు చేసుకుంటున్నారని గ్రామాల్లోని గ్రూపులు మండలస్థాయి సంఘాన్ని ఏర్పాటు చేసుకుంటున్నాయని, వీటి వలన రైతులకు కావాల్సిన ఆర్థిక రుణాలు, వ్యవసాయ పనిముట్లు రాయితీతో పొందుతున్నారని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఈచినేరి పల్లికి చెందిన రమేష్, ఉపాధ్యక్షులుగా మొగలి మిట్టూరుకు చెందిన ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శిగా బొమ్మాయపల్లికి చెందిన గణపతి, ఉపకార్యదర్శిగా పాలమాకలపల్లికి చెందిన గీత, కోశాధికారిగా సదకుప్పం చెందిన సుమంత్ రెడ్డి, బోర్డు మెంబర్లుగా జీవ రత్నం నాయుడు, భక్తుల రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఢిల్లీబాబు, గుణశేఖర్ రెడ్డి, రమణమ్మ, స్వప్న, దామోదర్ రెడ్డి, గుణశేఖర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారికి దుశాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, వైస్‌ఎంపీపీ శిరీష్ రెడ్డి, కోఆప్షన్ నెంబర్ ఫిరోజ్ అహ్మద్, మాజీ ఉత్పత్తుల సంఘ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, జయమ్మ, సర్పంచులు జ్యోతిరెడ్డి, రాజా పలువురు రైతులు పాల్గొన్నారు

విద్యార్థులు సమాజసేవకు సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి- కార్వేటినగరం: విద్యార్థులు సమాజసేవకు, దేశసేవకు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి పేర్కొన్నారు. సోమవారం డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుండి విద్యార్థులు సేవా దక్పథాన్ని అలవరుచుకోవాలని తెలిపారు. అలాగే పరిసరాలలో ప్లాస్టిక్ నివారణ, మొక్కలను పెంచడం, సామాజిక బాధ్యత కలిగి ఉండాలని కోరారు. అనంతరం ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాచరచన పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలసుబ్రమణ్యం ఆచారి, సీఎన్.లత, హరిబాబు, సుబ్బారావు, జోగి ప్రసాద్, కార్తీక్, భార్గవి, లావణ్య, స్వామి శివయ్య, గోపీ కష్ణ, శివరామకష్ణ, జేకేసి మెంటర్ లోకేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

బంగారుపాళ్యంలో..

బంగారుపాళ్యం: మహాత్మా గాంధీని అనుసరించి నడుచుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ గిరిబాబు అన్నారు. సోమవారం మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళి ఆధ్వర్యంలో సమావేశం జరిగినది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల నుంచి విద్యార్థులకు సేవాభావం కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో ఎన్ఎస్ఎస్‌ను ప్రారంభించారని తెలిపారు. ఈనెల 24 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు వివిధ కార్యకలాపాలు చేపట్టి అక్టోబర్ 2న మహాత్మ గాంధీ జయంతిని నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కళాశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు వ్యర్థాలను తొలగించారు. కళాశాల అధ్యాపకులు శ్రీనివాసులు, పద్మజ, హసీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు- నేడు పనులు వేగవంతం చేయాలి

ఉపవిద్యాశాఖ అధికారి చంద్రశేఖర్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం

పాఠశాలలో జరుగుతున్న నాడు- నేడు పనులు వేగవంతం చేయాలని ఉప విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ అకాడమిక్ ప్రారంభమైనప్పటి నుండి విద్యపై చేపడుతున్న విధానాలను అమలు చేయాలని, పాఠశాలలో జరుగు నాడు- నేడు పురోగతి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల చేర్పుట గురించి సిఆర్‌సి ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు తీసుకోవాలన్నారు. అలాగే ఉన్నత పాఠశాలలో నైట్ వాచ్‌మెన్ విధులు చేపట్టే విధంగా చూడాలని పాఠశాలకు ఇంకా కావాల్సిన వసతులపై పాఠశాల కమిటీలో చర్చించి పాఠశాలను కార్పోరేట్ పాఠశాలలుగా తయారు చేసుకునే బాధ్యత ప్రతి ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు. అదేవిధంగా మంగళవారం నుండి జరిగే సిఆర్‌సి సమావేశాలు జరపాలన్నారు. ఎంఈవో-2 రమేష్ బాబు, ఉన్నత పాఠశాల హెచ్ఎంలు, సిఆర్‌సిలు పాల్గొన్నారు.

'జిఐఎస్' పై విద్యుత్ శాఖ సిబ్బందికి అవగాహన

విద్యుత్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏఈ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

మండల విద్యుత్ శాఖ కార్యాలయంలో సోమవారం ఏఈ చంద్రుడు ఆధ్వర్యంలో సిబ్బందికి జిఐఎస్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులకు సంబంధించి మండలంలోని 21 పంచాయతీ పరిధిలోని లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్‌మెన్లు, ఏఎన్ఎంలతో సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. విద్యుత్ బకాయిల వసూళ్లు, విద్యుత్ వినియోగదారులకు ఆన్‌లైన్ ద్వారా పేమెంట్ చేసే విధానం గురించి అవగాహన కల్పించారు.

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపైచి త్తూరు నియోజకవర్గం. తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు వాణిజ్య విభాగం అధ్యక్షుడు హిమగిరి, రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు నీర జక్షుల నాయుడు, నియోజకవర్గ అధ్యక్షులు గుణశేఖర్ నాయుడు, మండల అధ్యక్షులు గిరి నాయుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి సురేంద్ర కుమార్, నగర అధ్యక్షురాలు కటారి హేమలత తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ సోమవారం తెలుగు తమ్ముళ్లు అర్థనగ్న ప్రదర్శన చేపట్టి తమ నిరసన వ్యక్తపరిచారు. ఈసందర్భంగా పలమనేరు పట్టణ ప్రధాన కార్యదర్శి గిరిబాబు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గ్యాస్ నాగరాజు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. రాజకీయ కక్ష ధోరణితో జగన్మోహన్ రెడ్డి చంద్రబాబుని అక్రమంగా అరెస్టు చేయించి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని అన్నారు. ఆర్బిసి కుట్టి, ఖాజాపిర్, జగదీష్ నాయుడు, మదన్, శ్రీధర్, హనీఫ్, సుధాకర్, సుబ్బు, బాబాజాన్, అస్లాం, సాదిక్ పాల్గొన్నారు.

నగరి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ బాబు కోసం మేము సైతం అంటూ నగరి మున్సిపాలిటీ, రూరల్ మండలం టిడిపి నాయకులు ఆధ్వర్యంలో నిరాహార దీక్షను నగరి ఆర్టీవో ఆఫీస్ ఎదురుగా చేపట్టారు. నగరి పట్టణ ప్రెసిడెంట్ రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి ఈఎన్ శ్రీనివాసన్, నగరి రూరల్ ప్రెసిడెంట్ శివకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, గుణశేఖర్ పాల్గొన్నారు.

27న స్పందన: ఎంపిడిఓ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఈనెల 27వ తేదీ బుధవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో సుధాకర్ రావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 27వ తేదీన మండల కార్యాలయం పరిధిలో స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు అందరూ కూడా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాన్నిమండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం స్పందన కార్యక్రమం నిర్వహణపై సచివాలయ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందజేవారు.

27న ప్రపంచ పర్యాటక దినోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు పర్యాటకశాఖ సంస్కృతికశాఖ అధికారి రుపేంద్ర నాథ్‌రెడ్డి, ఏడి రమణ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిత్తూరు గాంధీ విగ్రహం నుండి అంబేద్కర్ భవన్ వరకు 2కె రన్, వివిధ రకాల సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్మశాన స్థలం కేటాయింపు

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని కుప్పిగానిపల్లి గ్రామ ముస్లింసోదరులకు దశాబ్ద కాలం నుండి శ్మశానస్థలం సమస్య ఉండడంతో సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి వారికి ఈ స్థలాన్ని కేటాయించినట్లు స్థానిక సర్పంచ్ రామ్మూర్తి తెలిపారు. ఎమ్మెల్సీ భరత్ ఆదేశాల మేరకు మండల జడ్పిటిసి కష్ణమూర్తి, ఎంపిపీ వరలక్ష్మి గోపి, వెంకటస్వామి, స్థానిక ఎంపిటీసీ వెంకటేష్ వారి సహాయ సహకారాలతో ముస్లిం సోదరులకు శ్మశాన స్థలాన్ని జేసిబితో చదును చేసి సోమవారం అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆ గ్రామ ముస్లిం సోదరులు వీరికి కతజ్ఞతలు తెలిపారు.

నేడు మంత్రి పర్యటనపై సమీక్ష

ప్రజాశక్తి- సోమల: సదుం మండలంలోని మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లతో ఎంపీపీ ఎల్లప్ప 26వ తేదీ మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈ సమీక్షా సమావేశంలో ఈనెల 28వ తేదీ మంత్రి సదుం మండల పర్యటన, పలు భవనాల ప్రారంభోత్సవాలపై తీసుకోవాల్సిన కార్యాచరణ కార్యక్రమాలపై చర్చించడం జరుగుతుందని మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు రెడ్డప్ప రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు తప్పక అందరూ హాజరుకావాలని ఆయన తెలిపారు.

నేడు వేలం పాట

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్‌పురం పోలీస్ స్టేషన్‌లో సారాయి కేసులో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఎస్ఈబి అధికారుల సమక్షంలో 2 ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహించ బడుతుందని ఎస్ఐ షేక్షావలి తెలియజేశారు. ఈ వేలంపాటలో పాల్గొన్నదలచిన వారు 26వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకి ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్ వద్ద వేలం పాటలో పాల్గొనవచ్చని తెలియజేశారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి- నగరి: స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌లో నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సోమవారం హాస్టల్‌కు వెళ్లిన న్యాయవాదులు మహదేవన్, తిరుమల విద్యార్థులకు ర్యాగింగ్ చేయడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే విధించే శిక్షలను గురించి తెలియజేశారు. ఉన్నత విద్యలను ఆర్జించడానికి వెళ్లిన సమయంలో ర్యాగింగ్‌కు పాల్పడకూడని విద్యార్థులకు తెలిపారు.

మహిళలకు చేతివృత్తిపై అవగాహన

ప్రజాశక్తి- పాలసముద్రం: మండల కేంద్రంలో వీర్లగుడి ఏఎడబ్ల్యూలో సోమవారం కోయార్ బోర్డు వారి ఆధ్వర్యంలో రూరల్ యాక్షన్ సంస్థ కార్యదర్శి చిట్టిబాబు స్పిన్నింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చేతివత్తుల ద్వారా సామాజికంగా, ఆర్థికంగా అభివద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ లింకేజీలు కూడా ఉంటాయని, రెండు నెలల పాటు ఈ శిక్షణా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. గ్రామీణ మహిళలు ఈ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవి, భూపతి, ఆర్ముగం, లిల్లీ, రేఖ, భార్గవి, జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

తిరుపతి టౌన్ : నగరపాలక ప్రాథమిక పాఠశాల పట్నూలు వీధి నందు తిరుపతి లయన్స్ క్లబ్బు అధ్యక్షులు బి .మునికష్ణ నాయుడు ఆధ్వర్యంలో కార్పొరేటర్ బసవ గీత చేత విద్య కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ముని కష్ణ నాయుడు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుతున్నది చాలా వరకు పేద విద్యార్థులేనని అందుకే లయన్స్ క్లబ్ తరపున ఉచితంగా విద్యాసామాగ్రి అందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

కోలా శాంతి లతకు ఘన సన్మానం



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని గంగినాయనపల్లి గ్రామ పంచాయతీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోలా శాంతిలను సోమవారం ఎంఈఓ సాయిలీల, ఎంఈవో-2 సుబ్రహ్మణం ఘనంగా సన్మానించారు. శాంతిలత పదవీ విరమణ సందర్భంగా స్థానిక రాయల్ మహల్‌లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయురాలికి శాంతి లత విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాబుద్ధులు నేర్పి మెరుగైన భవిష్యత్ తరాన్ని తయారు చేశారని కొనియాడారు. అనంతరం శాంతి లత దంపతులకు శాలువ కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పి.కొత్తూరులో ఉచిత వైద్యశిబిరం

ఉచిత వైద్య శిబిరం పై అవగాహన కల్పిస్తున్న అమర్నాథ్

ప్రజాశక్తి- వికోట: మండల పరిధిలోని పి.కొత్తూరులో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు తనయుడు అమర్నాథ్ తెలిపారు. చిత్తూరు జిల్లా ఉమ్మడి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఛైర్మన్ స్వగహంలోని క్యాం కార్యాలయం వద్ద బెంగళూరుకు చెందిన ఆక్స్ఫర్డ్ మెడికల్ కళాశాల, హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో సుమారు 15మంది సూపర్ స్పెషాలిటీ వైద్యుల పర్యవేక్షణలో ఈ మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వివిధ రకాల జబ్బులకు ఈ వైద్యశిబిరంలో ఉచిత వైద్య సేవలు అందించనున్నారు. అదేవిధంగా చిత్తూరు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. మండల ప్రజలు ఈ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఉచితంగా మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి- వికోట:

ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి పెంచడం ద్వారా పర్యావరణాన్ని పెంపొందించేందుకు దోహదపడాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం వాసు అన్న యువ సైన్యం ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని వారు లాంఛనంగా ప్రారంభించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలుష్యం పెరిగి వాతావరణం కలుషితం అవుతుండడంతో ప్రజలు తీవ్రఅనారోగ్య పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. దీనిని అరికట్టే లక్ష్యంతో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వారి తనయుడు నరేంద్ర ఆధ్వర్యంలో వివిధ రకాల పండ్ల మొక్కలను సొంత నిధులతో కొనుగోలు చేసి మండల పరిధిలోని గ్రామాల్లో ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు వీటిని పరిరక్షించి భావితరాలకు అందించాలని పిలిపించారు. సుమారు లక్ష మొక్కలను పంపిణీ చేయాలన్నదే తమ లక్ష్యమని వారి తెలిపారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

ప్రజాశక్తి- సోమల: మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన గహాలను వారి సొంత స్థలాలలో నిర్మించుకుంటున్న లబ్ధిదారులను కలసి త్వరితగతిన వేగవంతంగా నాణ్యతతో కూడి నిర్మాణాలను పూర్తి చేయాలని డబ్ల్యూ ఏపిసిఐ (చెన్నై) లీడర్ కరీముల్లా కోరారు. సోమవారం నంజంపేట, సోమల పంచాయతీలలో గృహ నిర్మాణాలను బృందం పరిశీలించి వేగవంతంగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు అయ్యేలా చూడాలని, నిత్యం పర్యవేక్షణ చేస్తూ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివైఇఈ, ఏఈ, వర్క్ ఇన్స్పెక్టర్, ఈఎ పాల్గొన్నారు.

ఖాదర్‌బాషాకు

గుర్రం జాషువ స్మారక పురస్కారం

ప్రజాశక్తి-పీలేరు గుర్రం జాషువ స్మారక జీవిత సాఫల్య జాతీయ పురస్కారాన్ని పీలేరుకు చెందిన అంతర్జాతీయ బహు భాషా రంగస్థల, టివి, సినిమా కళాకారులు 'ఆల్ ది బెస్ట్' ఖాదర్ బాష షేక్ అందుకున్నారు. ఈ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి హైదరాబాదులోని తెలంగాణ సరస్వత భవనంలో అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్. సరోజనమ్మ ఆధ్వర్యంలో జరిగింది.